క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తాం



దేవినగర్‌లో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని దేవినగర్‌లో రూ.25.60 లక్షలతో కూడిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో దాదాపు అన్ని పనులు పూర్తి చేశామన్నారు. ఈనెల 13వ తేదీలోపు బోనాల వేడుకలకు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, రాంచందర్, నర్సింరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



సఫ్దార్‌నగర్‌లో మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్ ఈ బ్లాక్‌లో కార్పొరేటర్ సబిహా బేగం సోమవారం వాటర్‌వర్క్స్ మేనేజర్ విలియం ప్రకాష్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌లతో కలిసి నూతన మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఫ్దార్‌నగర్‌లో పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారని వారికి మంచినీటి కొరత చాలా ఉందని పేర్కొన్నారు. సమస్యను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ఆయన సహాయ సహకారాలతో నిధులు మంజూరు చేయించుకొని మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, సలీం, నార్లపురం నాగరాజు, మహబూబ్, అస్లాం, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

కమాన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని ప్రశాంతనగర్ కాలనీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం ముఖ ద్వారాన్ని ప్రశాంతనగర్ మెయిన్ రోడ్డులో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ కమాన్‌ను కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తల్లిదండ్రులు కీర్తిశేషులు గోపమ్మ, నరసింహారావుల జ్ఞాపకార్థం తన స్వంత నిధులతో నిర్మించామని తెలిపారు.

ముఖ్యమంత్రిసహాయ నిధి ఎల్‌ఓసీ పత్రం అందజేత



లబ్ధిదారురాలి కుటుంబీకులకు ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: ఎల్లమ్మబండలో నివాసం ఉంటున్న కౌసర్ బేగం అనారోగ్య సమస్యతో బాధపడుతూ.. ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోవటంతో కూకట్‌పల్లిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. దీంతో ఆయన వారితో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి బాధితురాలి కుటుంబ సభ్యులకు సోమవారం కార్యాలయంలో అందజేశారు.

బీసీ ముఖ్యమంత్రి సాధన కోసం ఐక్య కార్యాచరణ

లాలాపేట: వచ్చే ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రి చేయడానికి ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు మెజార్టీ కులాలకు చెందిన బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటించకుండా కేవలం బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యం అంటే మెజార్టీ రూలింగ్ అని తెలంగాణలో మైనార్టీ కులమే పాలన చేస్తుందని ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 19న వరంగల్‌లో బీసీ సీఎం సాధన సదస్సు ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సోమవారం గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దేవాలయాల్లో భక్తులతో కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి కాగడ హారతి, పంచామృతభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, సామూహిక సత్యవ్రతాలు, అనంతరం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం సంధ్యాహారతి, భజన, పల్లకి సేవ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.
– కూకట్‌పల్లి



గురుపౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణలో సాయిబాబా ఆలయం







సత్యసాయి వ్రతంలో పాల్గొన్న భక్తులు, సాయిబాబా దర్శనం కోసం వచ్చిన భక్తులు





పూజలు చేస్తున్న ఆలయ వ్యవస్థాపక చైర్మన్ జి. మాణిక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



వివేకానందకాలనీలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



ఎల్లమ్మబండలో సాయినాధుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్



సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు



సాయినాధుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



స్నేహపురికాలనీ షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి



సెయింట్ అగస్టా స్కూల్ కరస్పాండెంట్ సుకృత్ కుమార్‌ను సన్మానిస్తున్న సమతానగర్ కాలనీ సభ్యులు



వివేకానందనగర్ షిరిడీ సాయిబాబా ఆలయ హోమంలో పాల్గొన్న రాజేశ్వరరావు దంపతులు



శ్రీసాయి నాగేంద్రాలయంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



జనతానగర్‌లో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



పూజలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



బాగ్‌అమీర్‌లోని సాయిబాబా ఆలయంలో భక్తులు



దత్తాత్రేయ కాలనీలో సాయినాథుడిని పూజించిన భక్తులు

బీజేపీ భరోసా పాదయాత్ర

కూకట్‌పల్లి: బీజేపీ భరోసా యాత్రలో సోమవారం కూకట్‌పల్లిలో పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రధానంగా రోడ్లపై నీరు నిలచి రాకపోకలకు ఆటకం కలుగుతుందన్నారు. డ్రైనేజీ, శానిటరీ శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, అనే విధంగా మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.

◆ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎన్ని నిధులు వెచ్చించినా వాటిని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారని తెలిపారు. పాదయాత్రలో ప్రజలు మా వద్దకు తీసుకొస్తున్న సమస్యలన్నిటికీ పరిష్కారం తప్పక చూపుతామన్నారు.



బీజేపీ భరోసా యాత్రలో పాల్గొన్న మాధవరం కాంతారావు

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రంగాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యారావు, సూర్యప్రకాష్, కన్వీనర్ శ్రీకర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనులు ప్రారంభం

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని వినాయకనగర్‌లో రూ.50లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వీడీసీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఆయన కాలనీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనుల కోసం నిధులు మంజూరు చేసినందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఈ రషీద్, వర్కు ఇన్‌స్పెక్టర్ రాములు, కాలనీ అధ్యక్షుడు సిద్ధిరాములు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు సోమిరెడ్డి, దేవులపల్లి కృష్ణమూర్తి, భీమారావు పాల్గొన్నారు.



వినాయక్‌నగర్‌లో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు



ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు వేణుగోపాల్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా డి.వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం పలువురు నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కేపీహెచ్‌బీ డివిజన్ సీనియర్ నాయకులు పున్నారావు, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం

ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ప్రొ.సులేమాన్ సిద్ధిక్



రాయదుర్గం: ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిక్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్(ఎఫ్‌ఐపీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులను వెంటనే తరగతి గదులకు పంపుతారని, అందువల్ల వారికి విద్యాసంస్థలు, తరగతి గదులలో బోధన కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం చాలా అవసరమన్నారు. అంతకుముందు యూజీసీహెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా,పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘రియల్ ఎస్టేట్‌లకు ప్రభుత్వం కొమ్ముకాస్తోంది’

సాక్షి, మేడ్చల్ జిల్లా: పేద ప్రజలకు వంద గజాల జాగా ఇవ్వలేని ప్రభుత్వం బడా కార్పొరేట్ పెట్టుబడిదారులు,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తూ భూములను వారికి అప్పగిస్తోందని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకుడు డీజీ నరసింహారావు తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పక్షమా.. లేదా పెట్టుబడిదారుల పక్షమా తేల్చుకోవాలని అవసరముందన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు ధర్నా చేశారు. కార్మికులు కర్షకులు, పేదలు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఏకమై ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పలు జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి తీసేయిస్తోందన్నారు. ప్రజాసంఘాల కార్యకర్తలపై ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జి చేయించడంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న కొద్దిమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోలను సవరించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీసీ కెమెరాలు ఉన్నా చోరీలు ఆగుతలేవ్!

- సీసీ కెమెరాలు ఉన్నాయని పోలీసు గస్తీ బంద్
- కాలనీల్లో ఆగని చిల్లర దొంగతనాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- నిత్యం పెట్రోలింగ్ పెంచాలంటున్న కాలనీవాసులు



పాపిరెడ్డినగర్‌లో రాత్రి వేళల్లో పెట్రోల్ దొంగతనం చేస్తున్న చిల్లర దొంగలు (సీసీ ఫుటేజీ దృశ్యం)

ఆల్విన్‌కాలనీ: సీసీ కెమెరాల వల్ల నేరాలు తగ్గుముఖం పడతాయని ప్రజల్లో నమ్మకం ఉండేది. కానీ సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ నేరాలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి నెలకొంటోంది. గతంలో పోలీస్ సిబ్బంది, ఉన్నతాధికారులు రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేసేవారు. మరికొన్ని కాలనీల్లో గూర్ఖాలు తిరుగుతూ అప్రమత్తం చేసేవారు. కానీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నాటి నుంచి పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు గూర్ఖాలు కూడా కనుమరుగైపోయారు. ఇదే అదునుగా చూసుకొని దొంగలు దొంగతనాలకు పెచ్చిరిల్లిపోతున్నారు.

◆ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ప్రాంతాలైన ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, వెంకటేశ్వరనగర్, వెంకటపాపయ్యనగర్, తులసినగర్, ఆర్‌పీకాలనీ, పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా దొంగలు ద్విచక్ర వాహనాలపై వచ్చి ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాలలోని పెట్రోల్, ఆటోల్లోని డీజిల్ ఇతర పరికరాలు దోచుకు వెళుతున్నారు. అంతేకాక కొత్తగా నిర్మించే ఇళ్లలోని వైరింగ్ సామాన్లు, ఫ్యాన్లు, నల్లాలు, వాల్వ్‌లు వంటి పరికరాలను సైతం దోచుకెళుతున్నారు.

◆ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గేట్ల మీద నుంచి పైకి ఎక్కి వాటర్ ట్యాంక్‌ల వాల్వ్‌లను బంద్ చేసి నీటి కుళాయిలకు ఏర్పాటు చేసిన విలువైన ఇత్తడితో కూడిన నల్లాలను సైతం దొంగిలించుకుపోతున్నారు. ఇలా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్ని నెలలుగా దొంగతనాలు జరుగుతున్నాయని సీసీ కెమెరాల్లో చిక్కుతున్నారని సంబంధిత కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులతో పాటు నష్టపోయిన బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వారు పేర్కొంటున్నారు.

◆ విలువైన సొత్తుతో పాటు ప్రాణహాని కూడా జరిగినా ఇలానే ఉంటుందా అని ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఎక్కడ అని వారు ప్రశ్నిస్తున్నారు. ఎల్లమ్మబండలో గత కొద్ది రోజుల క్రితం ఓ ఇళ్లు నిర్మాణంలో ఉండగా రాత్రికి వచ్చిన చిల్లర దొంగలు విలువైన వైర్లు, స్విచ్ బోర్డులు దొంగిలించడంతో పాటు ఉదయం బయట ఉన్న బ్యాగులో వేసే పాలప్యాకెట్లు కూడా కొంతమంది దొంగలించుకుపోతున్నారు. దీంతో ఈ చిల్లర దొంగతనాల గురించి ఎవరికి చెప్పాలో తెలియక ఇంటి యజమానులు ఇబ్బంది పడుతున్నారు.

◆ ఇటీవల కాలంలో వెంకటేశ్వరనగర్‌లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం తెల్లవారు చూసుకునే సరికి మాయమైంది. దీంతో ఆ వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విధంగా చిల్లర దొంగలతో స్థానికులు తలలు పట్టుకుంటున్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

◆ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు రక్షణ కల్పించకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని చెప్పటం ఎంతవరకు సబబు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కనీసం గతంలో తిరిగినట్లు రక్షక్ వాహనం కూడా రాత్రి వేళల్లో తిరగటం లేదని పలువురు వాపోతున్నారు. పోలీసులను తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించుకుంటే విసుక్కుంటున్నారని, ప్రభుత్వం మాత్రం ఫిర్యాదుదారులతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అని చెబుతుంటే ఇక్కడి సమస్యలు, దొంగతనాలు చిన్న చిన్నవి అంటూ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు. దొంగతనాలు చేసే దొంగలను వెంబడిస్తే రాత్రి వేళల్లో వారు దాడి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

◆ ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు కాలనీల్లో శాంతి సమావేశాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరా పుటేజీలను గమనించి చిల్లర దొంగలను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా రాత్రి వేళల్లో గస్తీ పెంచి అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులపై వివరాలు అడిగి తెలుసుకొని దొంగతనాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకొని, ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆల్విన్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలోని ఎలక్ట్రికల్ సామన్లు, నల్లాలు దోచుకెళ్లిన దొంగలు



ధరణినగర్‌లో పెట్రోల్ దొంగతనానికి పాల్పడుతున్న చిల్లర దొంగలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132